



బందరులో నల్లబెలూన్లు ఎగురవేస్తున్న న్యాయవాదులు

భూ హక్కు చట్టంతో సివిల్ కోర్టులకు కాలం చెల్లు

- 6లో..

» బందరులో నల్లబెలూన్లు ఎగురవేసిన న్యాయవాదుల నిరసన



రాత్రి 11 గంటల సమయంలో క్వారీలో బోడె ఆధ్వర్యంలో నిరసన

అర్ధరాత్రి ఇసుక తవ్వకాలు

» అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే బోడె

- 6లో..



ఫ్లోరింగ్ పగిలిపోయిన మందపాలెం-7 అంగన్వాడీ కేంద్రం

అంగన్వాడీ కేంద్రాల్లో అసౌకర్యం

- చిన్నారులకు ఇబ్బందులెన్నో
- మొవ్వ ఐసీడీఎస్ పరిధిలో 67 కేంద్రాలు
- మరుగుదొడ్లు, తాగునీటి సమస్యతో సతమతం
- సమయ పాలన పాటించని కార్యకర్తలు
- పర్యవేక్షణ లేక అధ్వానం


కూచిపూడి : మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు కనీస సౌకర్యాలు లేక కునారిల్లుతున్నాయి. భవనాలు మరమ్మతులకు గురై పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు పరిధిలోని 67 అంగన్వాడీ కేంద్రాలు కనీస వసతులు కరువయ్యాయి. కాజశివారు మందపాలెం-7 కేంద్రంలో ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతిన్నది. ఈ కేంద్రంలో పిల్లలకు, అంగన్వాడీ సిబ్బందికి మరుగుదొడ్డి సౌకర్యం కూడా లేదు. వాడుక నీటికి కుళాయి కూడా లేక బయటి నుంచి తెచ్చుకుంటున్నారు. సౌకర్యాలు లేకపోవడంతో మందపాలెం-6 కేంద్రంలో 14 మంది చిన్నారులకు ఆరుగురు, మందపాలెం-7 కేంద్రంలో 12 మందికి ఎనిమిది మంది చిన్నారులు మాత్రమే హాజరవుతున్నారు. కాజలోని రెండు అంగన్వాడీ కేంద్రాల్లో, మందపాలెం-6 కేంద్రంలో సురక్షిత నీటికోసం అమర్చిన వాటర్ ప్యూరిఫైర్లు పనిచేయడం లేదు. అలంకార ప్రాయంగా మిగిలాయి. తాగునీటిని సమీప కుళాయిల నుంచి తీసుకు రావడానికి అంగన్వాడీ సిబ్బంది ఇబ్బందులకు గురువతున్నారు. అధికారుల అజమాయిషీ కొరవడింది. చిన్నారుల హాజరు శాతం సగానికి దాటడం లేదు. పలు కేంద్రాల్లో కార్యకర్తలు సమయపాలన పాటించటం లేదు. టాయిలెట్ సౌకర్యంలేని అంగన్వాడీ కేంద్రాలు దర్శనమిస్తున్నాయి. పలు కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. తాగునీటి సౌకర్యం లేని కేంద్రాలు చాలా ఉన్నాయి. సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సిన కార్యకర్తలు పలుచోట్ల ఆయాలకు అప్పగించి మధ్యాహ్నం నుంచి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. కేంద్రాలను పరిశీలించాల్సిన సూపర్‌వైజర్లు, అధికారులు ఆయా కేంద్రాలవైపు కన్నెత్తి చూసిన పాపాన పోవటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు, అధికారుల స్పందించి అంగన్వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాల్సిందిగా కోరుతున్నారు.

అయోమయం జగన్నాథం.. అన్నట్టుంది వైసీపీలో ప్రస్తుత పరిస్థితి. నేడు ప్రకటించిన అభ్యర్థులు రేపటికి ఉంటారో, లేదో, కీలకమైన స్థానాల్లో సిటింగ్‌లుగా ఉన్నవారు ఎన్నికల సమయానికి స్థిరంగా ఉంటారో, జంప్ అవుతారో తెలియని అయోమయ స్థితి రాజ్యమేలుతోంది. కొత్తగా నియమించిన ఇన్‌చార్జులన్నా చివరి వరకు నిలబడతారా.. అంటే సందేహమే సమాధానమవుతోంది. ఇదంతా ఒక ఎత్తయితే ఇన్‌చార్జిగా నియమించిన వ్యక్తే పార్టీ పెద్దలకు అందుబాటులోకి రాని చిత్రమైన పరిస్థితి.. ఎన్నికల ముందు కేడర్‌లో అనిశ్చితికి కారణమవుతోంది.

- రెండు జిల్లాల వైసీపీ అభ్యర్థుల ఎంపికలో అయోమయం
- అవనిగడ్డలో సింహాద్రి చంద్రశేఖర్‌రావు డౌటే..!
- ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్.. కొత్తగా సింహాద్రి వికాస్ పేరు
- పెనమలూరులో జోగి రమేశ్ పోటీ చేస్తారా..?
- వసంత పార్టీ వీడనుండటంతో మైలవరంపై జోగి కన్ను
- అనూహ్యంగా తెరపైకి సర్నాల తిరుపతిరావు
- పశ్చిమలో ఆసిఫ్ సీటుపైనా సవాలక్ష సందేహాలు
- కేశినేని నానికి ఎంపీ సీటు ఇస్తారో లేదో అనుమానమే
- ఇవ్వకపోతే కేశినేని శ్వేతకు పశ్చిమ లేదా మైలవరం..?

ఎవరెటు..?





ఎస్.తిరుపతిరావు



డాక్టర్ చంద్రశేఖర్‌రావు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : రెండు జిల్లాల వైసీపీ శ్రేణుల్లో తీవ్ర అనిశ్చితి నెలకొంది. కృష్ణాజిల్లాలో ఏడు స్థానాలకు గానూ నాలుగింటిలో అభ్యర్థులను ఖరారు చేస్తూ పార్టీ అధికారిక ప్రకటన చేసింది. మచిలీపట్నం, పెడన, పెనమలూరు, అవనిగడ్డ స్థానాలకు ఇన్‌చార్జులను ఖరారు చేయగా, అవనిగడ్డ ఇన్‌చార్జిగా నియమితులైన డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావు పార్టీ అధిష్ఠానానికే టచ్‌లో లేకుండా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసేశారు. ఆయనతో పూర్తిస్థాయిలో సంప్రదించకుండా, తుది నిర్ణయాన్ని చెప్పకుండానే వైసీపీ పెద్దలు ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారని చంద్రశేఖర్‌రావు సన్నిహితులు చెబుతున్న మాట. అవనిగడ్డ సిటింగ్ ఎమ్మెల్యే, ప్రస్తుత మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి రమేశ్ ఉద్దేశపూర్వకంగానే వైసీపీ పెద్దలను తప్పుదారి పట్టించారన్న ప్రచారం కూడా జరిగింది.

రమేశ్ తనయుడు వికాస్‌కు అవనిగడ్డ ఎమ్మెల్యే సీటు ఇప్పించే ప్రక్రియలో భాగంగా ఆయనే చంద్రశేఖర్‌రావును అవనిగడ్డ స్థానానికి ప్రతిపాదించారని, పోటీకి ఆయన సుముఖంగా ఉన్నారని వైసీపీ పెద్దలను నమ్మించారని చెబుతున్నారు. చంద్రశేఖర్‌రావు పోటీకి విముఖత చూపుతారు.. చివరికి తన కుమారుడే అభ్యర్థిగా నిలబడతాడన్న వ్యూహంతో రమేశ్ వైసీపీ పెద్దలను పక్కదారి పట్టించినట్లు వైసీపీ శ్రేణుల్లోనే చర్చ జరుగుతోంది. కాబోయే ఎమ్మెల్యే సింహాద్రి వికాస్ అంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం కూడా ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది.

జోగి.. ఎటువైపు..?

పెనమలూరు ఇన్‌చార్జిగా నియమితులైన మంత్రి జోగి రమేశ్ ఆ స్థానం నుంచి బరిలో ఉండకపోవచ్చన్న ప్రచారం జరుగుతోంది. తొలి నుంచి మైలవరం నుంచి పోటీకి తహతహలాడుతున్న జోగికి తాజాగా వసంత పార్టీని వీడనుండటంతో లైన్‌క్లియర్ అయ్యింది. అయితే, మైలవరం ఇన్‌చార్జిగా సర్నాల తిరుపతిరావు పేరును వైసీపీ గురువారం ప్రకటించింది. మైలవరం జెడ్పీటీసీగా ఉన్న తిరుపతిరావు ఆర్థికంగా బలహీనుడు. అలాంటి వ్యక్తిని అభ్యర్థిగా వైసీపీ చివరికి వరకు కొనసాగిస్తుందా అనేది అనుమానమే. చివరిగా జోగి రమేశ్ ఇక్కడ బరిలో ఉంటారని వైసీపీ శ్రేణులే బలంగా చెబుతున్నాయి. ఆర్థికంగా బలమైన వ్యక్తిని ఇక్కడ ఇన్‌చార్జిగా తీసుకొస్తే తనకు ఏకుమేకు అవుతాడన్న ఉద్దేశంతో జోగి రమేశ్ హడావుడిగా తిరుపతిరావును పార్టీ అధినేత జగన్ వద్దకు తీసుకెళ్లి మైలవరం ఇన్‌చార్జిగా ప్రకటింపజేశారని చెబుతున్నారు. ఎన్నికల సమయానికి తిరుపతిరావును సైడ్ చేసి జోగి రమేశ్ ఎంట్రీ ఇస్తారన్న ప్రచారం బలంగా జరుగుతోంది.

పశ్చిమలో ఆసిఫ్ ఉన్నట్టా లేనట్టా..?

పశ్చిమలోనూ షేక్ ఆసిఫ్ చివరి వరకు అభ్యర్థిగా నిలవడం అనుమానమేనని సమాచారం. ఆయన స్థానంలో మరో వ్యక్తిని తెరపైకి తెస్తారన్న ప్రచారం జరుగుతోంది.

కేశినేని నానీకి హ్యాండ్ ఇస్తారా?

వైసీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థిగా కేశినేని నాని పేరు ప్రకటించినా ఎన్నికల సమయానికి ఆయన స్థానంలో ఆర్థికంగా బలమైన వ్యక్తిని తెరపైకి తెచ్చే అవకాశం లేకపోలేదని వైసీపీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. నానీకి ఎంపీగా చేయిచ్చే పక్షంలో ఆయన కుమార్తె శ్వేతకు అసెంబ్లీ టికెట్ ఇస్తారని సమాచారం. విజయవాడ పశ్చిమ లేదా మైలవరం స్థానాల్లో ఒకటి నాని కుటుంబానికి కేటాయించి, ఆయనకు మొండిచేయి చూపుతారన్న ప్రచారం జరుగుతోంది.



కొర్రీలు.. కోతలు..!

ధాన్యం కొనుగోలులో కొనసాగుతున్న ప్రతిష్టంభన

- మిల్లుకు ధాన్యం తరలించిన తరువాత మద్దతు ధర నిర్ణయం
- మండలస్థాయి బృందం వచ్చినా వంకలు పెట్టి ధర తగ్గింపు
- తేమశాతం, రంగుమారిన ధాన్యం, నూకల శాతం అధికం సాకుతో ధర తగ్గింపు
- బిల్లుల చెల్లింపులోనూ జాప్యమే
- సతమతమవుతున్న రైతన్నలు

జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఇక్కట్లు తొలగడం లేదు. తేమశాతం, రంగు మార్పు పేరుతో ధర తగ్గించేస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులు మిల్లులకు ధాన్యం పంపితే అనేక వంకలు పెట్టి మద్దతు ధరలో కోత పెడుతున్నారు. కొనుగోలు చేసినా బిల్లులు సకాలంలో రైతులకు అందడం లేదు. జిల్లాలో పండించిన ధాన్యాన్ని చిత్తూరు జిల్లాకు ఆఫ్‌లైన్‌లో విక్రయించేస్తున్నారు. జిల్లాలో మాత్రం ఆన్‌లైన్ పద్ధతిలోనే ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. – మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

ధాన్యం బిల్లులు పెండింగ్‌లోనే

జిల్లాలో ధాన్యం కొనుగోలును పర్యవేక్షించేందుకు పౌరసరఫరాల జిల్లా మేనేజరు పోస్టు ప్రస్తుతం ఖాళీగా ఉంది. తోట సతీష్‌ను ఈ పోస్టులో నియమించారని చెబుతున్నా అధికారికంగా ఉత్తర్వులు ఇంకా రాలేదు. ఇప్పటివరకు ఇన్‌చార్జి మేనేరుగా కొనసాగిన ఉయ్యూరు ఆర్డీవో ఈ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. రైతులు ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇబ్బందులను మండల, డివిజన్ స్థాయిలో తహసీల్దార్, ఆర్డీవోలు, వ్యవసాయశాఖ ఏవోలు, ఏడీలకు వివరించినా, మిల్లర్లు చెప్పిందే తుది నిర్ణయంగా మారుతోంది. గతనెల 12వ తేదీ నుంచి జిల్లాలో ధాన్యం బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఇప్పటివరకు రూ.150 కోట్ల వరకు పెండింగ్ ఉన్నట్టు పౌరసరఫరాల సంస్థ అధికారులు చెబుతున్నారు. ఇటీవల జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ధాన్యం బిల్లులు సకాలంలో రావడం లేదని, ఇప్పించాలని వ్యవసాయ సలహామండలి సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పరిష్కరిస్తామని చెప్పినా ఫలితం లేకుండా పోయింది. గన్నవరం నియోజకవర్గంలోనే రూ.8 కోట్ల వరకు ధాన్యం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

జరుగుతున్నది ఇదీ

ప్రస్తుతం రైతులు ఆర్‌బీకేల ద్వారా ధాన్యాన్ని గతంలో ఆఫ్‌లైన్, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో పంపితే మిల్లుల వద్ద ధాన్యం ధర కోత పెడుతున్నారు. ఒకరైతు పేరున 20 క్వింటాళ ధాన్యం మిల్లుకు వెళితే తేమ శాతం, రంగు మారిందని, నూకల శాతం అధికంగా ఉందని క్వింటాలుకు పది కిలోల చొప్పున కోత పెడుతున్నారు. 20 క్వింటాళ్లకు బదులుగా 18 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే రైతు విక్రయించాడని అధికారికంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఈ ధాన్యానికి పూర్తిస్థాయిలో మద్దతు ధర ఇచ్చినట్టుగా చూపుతున్నారు. రైతు నుంచి మినహాయించిన రెండు క్వింటాళ్ల ధాన్యం ఏమైపోతోంది. ఈ నగదు ఎవరికి చేరుతోందనే అంశం మిస్టరీగా మారిందని రైతులు అంటున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదని, మండలస్థాయిలో నియమించబడిన బృందం సభ్యులు మిల్లర్లకే వంతపాడుతూ రైతులకు అన్యాయం చేస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు.

- మోపిదేవి మండలం కే కొత్తపాలేనికి చెందిన మత్తి వెంకటరామారావు రెండెకరాల భూమిని కౌలుకు సాగుచేశాడు. కుప్ప నూర్పిడి అనంతరం కే కొత్తపాలెం ఆర్‌బీకే ధాన్యం శాంపిళ్లను చూపితే బస్తాకు రూ.1650 మద్దతు ధర వస్తుందని చెప్పి, ఆన్‌లైన్ ద్వారా పెదకళ్లేపల్లిలోని రైస్‌మిల్లుకు ధాన్యాన్ని పంపారు. రెండు రోజులపాటు ఈ ధాన్యాన్ని దించుకోకుండా జాప్యం చేశారు. సంబంధిత రైతు అధికారులకు విషయం తెలియజేశారు. అధికారులు మిల్లు వద్దకు వచ్చారు. ధాన్యంలో తేమశాతం 26 పాయింట్లు ఉందని, ధాన్యం రంగు మారిందని పూర్తిస్థాయిలో మద్దతు ధర రాదని అధికారులు, సిబ్బంది చెప్పారు. రెండు రోజుల చర్చల అనంతరం బస్తా ధాన్యానికి రూ.1392 ధరగా ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు.

రైతుల పరిస్థితి ఇదీ..

కపిలేశ్వరపురంలోని రైతు దుర్గారావుకు చెందిన 125 టిక్కీల ధాన్యాన్ని రెండ్రోజుల క్రితం మొవ్వ మండలం నిడుమోలులోని రైస్‌మిల్లుకు కపిలేశ్వరపురం ఆర్‌బీకే-2 ద్వారా పంపారు. మిల్లుకు చేరాక ధాన్యం రంగు మారిందని కారణంతో యజమాని రైతును పిలిపించాడు. ఆర్‌బీకేలో సూచించిన విధంగా ధాన్యం మద్దతు ధర ఇవ్వలేమని, క్వింటాలు ధాన్యానికి రూ.250 ధర తగ్గించి ఇస్తామని చెప్పాడు. దీంతో అధికారులకు రైతు సమాచారం అందించాడు. అధికారులు మిల్లు వద్దకు వచ్చి కాసేపు హడావుడి చేశారు. మళ్లీ ధాన్యం నాణ్యతను పరిశీలించారు. మినీ మిల్లింగ్ మిషన్ అందుబాటులో లేదని చెప్పి రాత్రి వరకు రైతును మిల్లు వద్దనే ఉంచారు. ఏమీ చేసేదిలేక మీరెంత ధర నిర్ణయిస్తారో చెబితే అందుకు అంగీకరించి తాను వెళ్లిపోతానని తనంతట తానుగా రైతు చెప్పేవరకు అధికారులు, మిల్లరు కలిసి వ్యూహం నడిపారు.

- ఉయ్యూరు మండలం ఓగిరాలకు చెందిన జి.శ్రీనివాసరెడ్డి 12 ఎకరాల కుప్ప నూర్పిడి చేశాడు. ధాన్యాన్ని ఆర్‌బీకే తీసుకువెళితే ధర తక్కువగా వస్తుందని అక్కడి సిబ్బంది చెప్పారు. ధాన్యం శాంపిళ్లను సమీపంలోని రెండు మిల్లుల వద్దకు తీసుకువెళితే ఆర్‌బీకేలో సూచించిన ధరకన్నా అధికంగా మద్దతు ధర వస్తుందని చెప్పారు. దీంతో ఈ రైతు మద్దతు ధర అధికంగా ఇచ్చే మిల్లుకు ధాన్యం విక్రయిస్తానని, ఆన్‌లైన్‌లో ధాన్యం వివరాలు నమోదు చేయాలని కోరాడు. ఓగిరాల ఆర్‌బీకే పరిధిలో ఈ రైతుకు అధిక ధర ఇచ్చే మిల్లు ట్యాగింగ్ జరగలేదని, అక్కడకు ధాన్యం పంపడం కుదరదని ఆర్‌బీకే సిబ్బంది చెప్పి పంపేశారు. ఇదే విషయాన్ని ఆర్డీవోకు రైతు తెలియజేశారు. అయినా ఈ రైతు సమస్య తీరలేదు. 12 ఎకరాలకు సంబంధించి ధాన్యం విక్రయిస్తే రూ.30వేల రూపాయలు వ్యత్యాసం వస్తోందని ఈ రైతు చెబుతున్నారు.

- 70 రోజులైనా మొదలు కాని పనులు
- 2,500 కుటుంబాల ఉపాధికి గండి
- భూములు ఖాళీ చేయాలని కలెక్టర్ ఉత్తర్వులు
- హైకోర్టుకెళ్లిన కంపెనీ యాజమాన్యం

వివాదంలో 'భారత్ సాల్ట్'

మచిలీపట్నం మండలం పల్లెతుమ్మలపాలెంలోని భారత్ సాల్ట్ రిఫైనరీస్ భవిష్యత్తు అంధకారంలో పడింది. పోర్టుకు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కంపెనీ భూములను ఇచ్చే ప్రయత్నంలో ప్రభుత్వం ఉంది. దీనికి తోడు పోర్టు నిర్మాణానికి రుణం నిమిత్తం తనఖాగా కంపెనీ భూములను చూపే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భూములను ఖాళీ చేయాలని భారత్‌సాల్ట్ కంపెనీ యాజమాన్యానికి కలెక్టర్ గతేడాది సెప్టెంబరులో ఉత్తర్వులు జారీ చేశారు. కంపెనీ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. జిల్లా యంత్రాంగం, భారత్‌సాల్ట్ కంపెనీ యాజమాన్యం మధ్య న్యాయపరమైన వివాదం నడుస్తోంది.



పల్లెతుమ్మలపాలెంలోని భారత్‌సాల్ట్ ఫ్యాక్టరీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : భారత్‌సాల్ట్ ఫ్యాక్టరీని ఆధారంగా చేసుకుని తీర ప్రాంతంలోని పల్లెతుమ్మలపాలెం, కోన, పోలాటితిప్ప గ్రామాలకు చెందిన చెందిన 2,500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ఏటా డిసెంబరు 15వ తేదీ నుంచి జూన్, జూలై నెలల వరకు ఈ ఫ్యాక్టరీలో ఉప్పు ఉత్పత్తి, రవాణా తదితర పనులను చేస్తూ ఉంటారు. గత ఏడాది సెప్టెంబరు నెలలో సాల్ట్ ఫ్యాక్టరీ భూములను ప్రభుత్వానికి అప్పగించాలని నోటీసులు జారీ చేయడంతో ఫిబ్రవరి వచ్చినా ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. దీంతో మూడు గ్రామాలకు చెందిన 2,500 మంది పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. పనులు లేకపోవడంతో రెండురోజుల క్రితం మూడు గ్రామాలకు చెందిన ప్రజలు సమావేశం ఏర్పాటు చేసుకుని భవిష్యత్తులో ఏం చేయాలనే అంశంపై చర్చించారు.

● కలెక్టర్‌తో సమావేశం

భారత్ సాల్ట్ ఫ్యాక్టరీలో పనులు ప్రారంభించకపోవడం, మూడు గ్రామాల ప్రజల ఉపాధికి గండి పడటంతో ఆ గ్రామాల ప్రజల నుంచి పనులు ప్రారంభించాలని ఒత్తిడి వస్తోంది. గురువారం బందరు ఎమ్మెల్యే పేర్ని నాని, సాల్ట్ ఫ్యాక్టరీ డైరెక్టర్ ప్రసాద్ కలెక్టర్‌ను కలిశారు. ఫ్యాక్టరీ తెరిచే అంశంపై చర్చించారు. అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. హైకోర్టు ఆదేశానుసారం అనుమతులు ఇవ్వలేమని కలెక్టర్ తేల్చి చెప్పినట్టు సమాచారం. ఉప్పు ఉత్పత్తి పనులు ప్రారంభించాలంటే ఏడాదికి రూ.50 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని, అధికారికంగా అనుమతులు ఇస్తేనే పనులు ప్రారంభిస్తామని సాల్ట్‌ఫ్యాక్టరీ డైరెక్టర్ చెప్పడంతో ఈ అంశం ఇప్పట్లో కొలిక్కి వచ్చే సూచనలు కనిపించడంలేదు. ఈనెల 4వ తేదీ ఆదివారం సాల్ట్‌ఫ్యాక్టరీ తెరిచే అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించుకుని, ఆ తరువాత పరిణామాలను బట్టి తదుపరి కార్యాచరణకు దిగే ప్రయత్నంలో మూడు గ్రామాల ప్రజలు ఉన్నారు.

● ఒక్కో కుటుంబానికి రూ.70 వేలకుపైగా నష్టం

భారత్ సాల్ట్‌ఫ్యాక్టరీలో పనిచేసే కూలీలు ఒక్కొక్కరికి కనీసంగా రోజుకు వెయ్యి రూపాయల చొప్పున కూలి వస్తుంది. ఒక కుటుంబంలో భార్యభర్తలు ఇద్దరూ పనిచేస్తే కనీసంగా నెలకు రూ.60వేలకు తక్కువ కాకుండా సంపాదించుకునేవారు. నెలన్నర రోజులుగా పనిలేకపోవడంతో ఒక్కో కుటుంబం సుమారుగా రూ.70వేలను కోల్పోయారు. సాల్ట్‌ఫ్యాక్టరీని మూసివేస్తే తమకు ఉపాధి అవకాశాలు ఉండవని, ఎలాగైనా ఈ ఫ్యాక్టరీని తెరవాల్సిందేననే డిమాండ్ స్థానికుల నుంచి వ్యక్తమవుతోంది. బందరు మండలంలోని పల్లెతుమ్మలపాలెం రెవెన్యూ గ్రామపరిధిలోని 71 సర్వే నెంబరులో 5,600 ఎకరాలు, పోలాటితిప్ప గ్రామ రెవెన్యూ పరిధిలో 1400 ఎకరాలను భారత్‌సాల్ట్ రిఫైనరీస్ లిమిటెడ్‌కు 2001లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉప్పు పండించేందుకు కేటాయించింది. గతేడాది సెప్టెంబరులో మచిలీపట్నం పోర్టు డైరెక్టర్, కలెక్టర్, ఎమ్మెల్యే పేర్ని నాని, ఏపీ మేరీటైమ్‌బోర్డు అధికారులు కలెక్టరేట్‌లో సమావేశమైన సమయంలో భారత్‌సాల్ట్ భూములను ఏపీ మేరీటైమ్ బోర్డుకు అప్పగించాలని నిర్ణయించారు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో వేలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న భారత్‌సాల్ట్ ఫ్యాక్టరీ భూములను స్వాధీనం చేసుకుంటే ఇబ్బందులు తలెత్తుతాయనే అంశం ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. అయినా ప్రభుత్వ పెద్దల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు గుట్టుచప్పుడు కాకుండా ఈ భూముల స్వాధీనానికి నోటీసులు జారీ చేయడం గమనించదగ్గ అంశం. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీకి చెందిన నాయకులు సాల్ట్‌ఫ్యాక్టరీ ఎక్కడికీపోదని గ్రామస్తులను నమ్మించేందుకు ఇప్పటికీ ప్రయత్నాలు చేస్తుండటం చర్చనీయాంశమవుతోంది.



జగ్గయ్యపేటకు వచ్చిన అమ్మవారు, పరివార దేవతల వాహనాలు

జగ్గయ్యపేటకు చేరిన తిరుపతమ్మ, గోపయ్యల పరివారం

» ఘనంగా స్వాగతం పలికిన భక్తులు, దీక్షాస్వాములు



జగ్గయ్యపేట, ఫిబ్రవరి 2 : రంగుల మహోత్సవానికి శుక్రవారం సాయంత్రం పెనుగంచిప్రోలు గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారు, పరివార దేవతలు జగ్గయ్యపేటకు చేరుకున్నారు. పెనుగంచిప్రోలులో బయల్దేరి మక్కపేట, చిల్లకల్లు మీదుగా ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండ్లపై అమ్మవార్లను సాంప్రదాయబద్ధంగా జగ్గయ్యపేటకు తీసుకువచ్చారు. దేవస్థానం పాలక మండలి సభ్యులు, ఇవో, స్థానిక రంగుబజార్ ఉత్సవ కమిటీ సభ్యులు దేవతామూర్తులను రామాలయంలో ఉంచారు. అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పీఠంపై అధిష్ఠింప చేశారు. దేవతామూర్తులను ఎడ్లబండ్లపై తీసుకువచ్చే సమయంలో తాకేందుకు దీక్షాస్వాములు, భక్తులు ఎగబడ్డారు. ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, కేడీసీసీబీ మాజీ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. హెచ్‌పీ గ్యాస్ డీలర్, అన్నపూర్ణ గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రయిటర్ అప్పన రామ్‌కుమార్ భక్తులకు అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేశారు. ఊరేగింపులో దేవస్థానం ఛైర్మన్ జంగాల వాసు, ఇఓ కె.రమేష్ నాయుడు, ఆకుల బాజీ, దేవస్థాన కమిటీ సభ్యులు దేవరకొండ పద్మ, చిన్ని దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



దివ్యసత్ప్రసాదంతో మరియమాత గుహకు చేరుకుంటున్న గురువులు

మత సామరస్యానికి ప్రతీక గుణదల పుణ్యక్షేత్రం

» మూడో రోజుకు నవదిన ప్రార్థనలు

గుణదల, ఫిబ్రవరి 2 : గుణదలమాత పుణ్యక్షేత్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని గుంటూరు మేత్రాసనం ఫాదర్ గోవిందు రాయన్న అన్నారు. గుణదలమాత నూరు వసంతాల నవదిన ప్రార్థనల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన నవదిన ప్రార్థనల కార్యక్రమానికి ఫాదర్ గోవింద్ రాయన్న ముఖ్యఅతిథిగా విచ్చేశారు. భక్తులను ఉద్దేశించి ఆయన సందేశమిస్తూ.. మరియమాతను దేవుడు ఆధ్యాత్మిక తల్లిగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. మరియతల్లిని ఆశ్రయించిన కష్టాలు తీరతాయని చెప్పారు. పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ.. ఈ యేడాది ఉత్సవాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, ఎస్ఎస్‌సి డైరెక్టర్ తోట సునీల్ రాజు గురువులు దివ్యసత్ప్రసాదంతో కొండపైకి పాదయాత్రగా వచ్చారు. అనంతరం దివ్యపూజాబలి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ పాల్స్ కతెడ్రల్, కార్మెల్‌నగర్, రాణిగారితోట తదితర విచారణల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



భారత్ రంగస్థల మహోత్సవ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

6 నుంచి తుమ్మలపల్లిలో భారత్ రంగస్థల మహోత్సవ్

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 2 : ఈనెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు విజయవాడలో 23వ భారత్ రంగస్థల మహోత్సవ్-ఇంటర్నేషనల్ థియేటర్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా-2023 నాటకాల ప్రదర్శన జరగనుందని, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఢిల్లీరావు, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జునరావు, జేసీ పి.సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి భారత్ రంగస్థల మహోత్సవ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రంగస్థల కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) దేశ విదేశాల నుంచి 100 నాటకాలను ఎంపిక చేసి దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో ఫిబ్రవరి 1 నుంచి 21 వరకు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త అధ్వర్యంలో ఈనెల 6 నుంచి 11 వరకు విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నాటక ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి నాటక ప్రదర్శన వుంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలు, కళాకారులు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

నాస్తికోద్యమానికి గోరా సేవలు అమూల్యం : ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 2 : సానుకూలంగా ఆలోచించే ఏ వ్యక్తి అయినా దేవుడు ఉన్నాడు, లేడు అనే విషయంతో సంబంధం లేకుండా సమాజంలోని వ్యక్తుల ప్రయోజనాల కోసమే పనిచేస్తారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. భారతదేశ నాస్తికోద్యమ పితామహుడు గోపరాజు రామచంద్రరావు (గోరా) ఐదు దశాబ్దాల క్రితం 1972లో రచించిన ఆంగ్ల పుస్తకం 'పాజిటివ్ ఎథీజం' తెలుగు అనువాదాన్ని బెంజ్‌సర్కిల్ సమీపంలోని నాస్తిక కేంద్రంలో శుక్రవారం జరిగిన సభలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారతదేశ నాస్తికోద్యమానికి గోరా గొప్ప చిరునామాగా నిలిచారన్నారు. దైవత్వం వ్యక్తులకు ఆపాదించడాన్ని వ్యతిరేకించడమే నాస్తికత్వానికి ఆలంబన అని గోరా గాఢంగా నమ్మేవారన్నారు. సమాజంలోని వ్యక్తుల ప్రయోజనాలను కాపాడలేని వారిని విగ్రహాల రూపంలో ఆరాధించడం తప్పుడు అభిప్రాయమని నమ్మిన ఎంతోమందిని ఆ రోజుల్లోనే గోరా చాలా ప్రభావితం చేశారని గుర్తు చేశారు. అంతిమంగా సంఘ ప్రయోజనాలను కాపాడటమే నాస్తికత్వానికి వున్న అతి పెద్ద లక్ష్యంగా ఆయన సాధించిన ఉద్యమం నేటికీ నిరాఘాటంగా కొనసాగడం, ఈ ఉద్యమాన్ని వారి కుటుంబసభ్యులు మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమన్నారు.

జీవితం ధన్యమైంది : డాక్టర్ సమరం

పుస్తక అనువాద కర్త డాక్టర్ సమరం మాట్లాడుతూ, నాస్తికత్వాన్ని జీవిత విధానంగా మలుచుకొని ఎంతో శ్రమించి గోరా పాజిటివ్ ఎథీజం పుస్తకాన్ని రచించారని, ఆయన భావాలకు అద్దం పట్టేలా తెలుగులో అనువదించే అవకాశం రావడంతో జీవితం ధన్యమైందని భావిస్తున్నానన్నారు. సామాజిక సమానత్వం మనిషి స్వేచ్ఛ ఆర్థిక సామాజిక వ్యవస్థల మార్పునకు నాస్తికత్వం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో గోరా కుటుంబసభ్యులు డాక్టర్ మారు, జి.రష్మి, జి.నియంత, ఆంధ్ర ఆర్ట్ అకాడమీ కార్యదర్శి గోళ్ల నారాయణరావు, ప్రముఖ నాస్తికులు నార్నే వెంకట సుబ్బయ్య, మోతుకూరి అరుణ్‌కుమార్, స్వాతంత్ర్య సమరయోధులు మోతుకూరి వెంకటేశ్వరరావు, గోరా అభిమానులు పాల్గొన్నారు.

ప్రముఖ హోమియో వైద్యుడు పద్మనాభం మృతి



గుడివాడ, ఫిబ్రవరి 2 : హోమియో వైద్యరంగ పితామహుడు, అంతర్జాతీయ హోమియో వైద్యుడు డాక్టర్ కేవీపీ పద్మనాభం(85) శుక్రవారం మృతి చెందారు. 64 ఏళ్ల పాటు హోమియోరంగంలో ఆయన సుదీర్ఘ సేవలందించి దేశవ్యాప్తంగా ప్రత్యేకఖ్యాతి గడించారు. హోమియో వైద్యం అభివృద్ధికి అనేక సూచనలు చేసిన ఆయనకు భారత ప్రభుత్వం విశిష్ట అవార్డులతో సత్కరించింది. రాష్ట్రపతి వీవీ గిరి హయాంలో ఏర్పాటు చేసిన వైద్యుల ప్యానల్‌లో డాక్టర్ పద్మనాభం అడ్వైజర్‌గా సేవలందించారు.

ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు

» కృష్ణా కలెక్టర్ రాజాబాబు



మచిలీపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎంకే మీనా శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల జాబితాల నవీకరణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1763పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు తగు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ వీడియోగ్రఫీ, వెబ్ టెలీకాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేసేందుకు ఎన్నికల వ్యయం లెక్కింపు బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల సమయంలో మద్యం, నగదు రవాణా అరికట్టేందుకు నిఘా ఏజెన్సీలను కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డీఆర్వో పెద్ది రోజా, ఎన్నికల విభాగం అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కృష్ణలంక : సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో బీహెచ్.భవానీశంకర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులతో కలిసి హాజరయ్యారు. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, ఓటర్ల తుది జాబితా ప్రచురణ అనంతరం వివిధ ఫారాల పరిష్కారం, అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు, పోలింగ్ స్టేషన్లు, కనీస వసతుల కల్పన, పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణ తదితర అంశాలపై సీఈవో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలోని సన్నద్ధతా కార్యకలాపాలను కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, ఎలక్షన్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్, నానిల శ్రద్ధ దోచుకోవడంపైనే..

» వెనిగండ్ల, రావి ఎద్దేవా



బాబు ష్యూరిటీ కార్యక్రమంలో వెనిగండ్ల, రావి తదితరులు

గుడివాడ, ఫిబ్రవరి 2 : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నానిలకు దోచుకోవడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారంపై లేదని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆరోపించారు. శుక్రవారం గుడ్లవల్లేరు మండలం కౌతవరంలో 'బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెనిగండ్ల, రావిలు మాట్లాడుతూ, దోచుకోవడమే లక్ష్యంగా జగన్ అండ్ కో పాలన సాగించిందన్నారు. దగాకోరుల ప్రభుత్వాన్ని పారద్రోలి, ప్రజల మేలుకోరే టీడీపీ, జనసేన ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. గుడివాడ అభివృద్ధి పట్ల చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, శాయన పుష్పావతి, కొసరాజు బాపయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

కేశినేని నానీ.. ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలువ్

» ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హితవు

పటమట, ఫిబ్రవరి 2 : కేశినేని నాని ఇండిపెండెంట్‌గా పోటీచేసి గెలవాలని గద్దె రామ్మోహన్ అన్నారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాని ఎంపీగా పోటీ చేయడం వల్లే తూర్పులో తాను ఎమ్మెల్యేగా గెలిచానని, నాని లేకపోతే తాను జీరో అని.. అన్న న్యాని వ్యాఖ్యలను ఆయన తిప్పికొట్టారు. పార్టీ మారితే వ్యక్తిత్వం దిగజారుతుందనడానికి కేశినేని నాని దిగజారుడు వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. ఆయనపై ఉన్న అభిమానంతోనే ఆయన శక్తిని చూసేందుకు ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని కోరుతున్నానన్నారు. జగన్‌కు అభివృద్ధి అంటే తెలియదని చెప్పిన మాటలు నాని మర్చిపోయారా అని ప్రశ్నించారు. పదవుల కోసం వ్యక్తిత్వాన్ని దిగజార్చుకోవద్దని.. ఒక మిత్రుడిలా నానికి సలహా ఇస్తున్నానని అన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఇసుక అక్రమ తవ్వకాలు

» అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

చోడవరం/మద్దూరు (కంకిపాడు), ఫిబ్రవరి 2 : అర్ధరాత్రి ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తుంటే అధికారులు నిద్రపోతున్నారా అంటూ మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెనమలూరు మండలంలోని చోడవరం, కంకిపాడు మండలం మద్దూరు ఇసుక రేవులో అర్ధరాత్రి 11 గంటల సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారం మేరకు ఎమ్మెల్యే చోడవరం వెళ్లి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే అనుచరులు అర్ధరాత్రి సమయంలో పెనమలూరు, కంకిపాడు మండలాల్లో ఇసుక తవ్వకాలు జరుపుతుంటే అధికారులు నిద్ర మొద్దు నిద్ర వహిస్తున్నారా అని మండిపడ్డారు. ఇసుక తరలింపు ఆపే వరకు కదిలేది లేదని భీష్మించుకొని కుర్చున్నారు. అటు మైనింగ్ ఇటు రెవెన్యూ అధికారులు అక్రమ తవ్వకాలకు ఎవరు పాల్పడుతున్నారన్న దానిపై స్పష్టత లేదంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. భారీ పొక్లెయినర్ల సాయంతో అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జోగి రమేశ్‌ను ఇన్‌చార్జిగా పెట్టి పది రోజులు కాకుండానే వేల లారీలతో బిల్లులు లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎటువంటి మైనింగ్ జరగకుంటే మంత్రి జోగి అనుచరుడు ఫిరోజ్ ఎందుకు పారిపోయాడని ప్రశ్నించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే అడ్డుకుంటామన్నారు. దీనిపై ఉపేక్షించేది లేదని మంత్రి జోగిని హెచ్చరించారు. సంబంధిత శాఖ అధికారులు వచ్చిన చర్యలు తీసుకునేంత వరకు కదిలేది లేదని హెచ్చరించారు.

బందరులో జెండా దిమ్మెల వివాదం

» కూల్చివేసేందుకు వచ్చిన మునిసిపల్ సిబ్బంది

» జనసేన, టీడీపీ నేతల ఆందోళన



భాస్కరపురంలో జనసేన జెండా ఆవిష్కరిస్తున్న బండి రామకృష్ణ



రోడ్డు పక్కనే వైసీపీ జెండా

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 2 : మచిలీపట్నం భాస్కరపురం గాంధీబొమ్మ సెంటర్‌లో జనసేన నేత దళిత జేఏసీ నాయకుడు కరుణాకర్ నిర్మించిన జెండా దిమ్మెను తొలగించేందుకు మునిసిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది ప్రయత్నించడంతో జనసేన, టీడీపీ నాయకులు ఆందోళన నిర్వహించారు.

నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మోటమర్రి బాబా ప్రసాద్, ఎండీ ఇలియాస్ బాషా తదితరులు పాల్గొన్నారు. రోడ్డు మధ్యలో నిర్మించిన వైసీపీ జెండా దిమ్మెలు కనపడవా.. అంటూ సిబ్బందిని అడ్డుకున్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, ఎమ్మెల్యే పేర్నినాని, ఆయన తనయుడి ఒత్తిడికి తలొగ్గి అధికారులు, పోలీసులు జనసేన, టీడీపీ నాయకులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, కార్యదర్శి పిప్పళ్ల కాంతారావులు మాట్లాడుతూ, వైసీపీ నాయకులకు జనసేన, టీడీపీ జెండాలు చూస్తుంటేనే ఎక్కడలేని భయం పుట్టుకువస్తోందన్నారు. టీడీపీ, జనసేన నేతల ఆందోళనతో చేసేదిలేక మున్సిపల్ సిబ్బంది వెనుదిరిగారు.

నేడే వడ్లపూడి బాబా మందిర వార్షికోత్సవం

» పెదవడ్లపూడిలో తిరునాళ్ల వాతావరణం

» సాయి నామస్మరణతో మార్మోగిన గ్రామం

» ఏర్పాట్లను పర్యవేక్షించిన పాతూరి





భగవాన్ శ్రీ సత్య షిరిడీ సాయిబాబా, అన్న సంతర్పణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పాతూరి నాగభూషణం

మంగళగిరి, ఫిబ్రవరి 2 : మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలోని భగవాన్ శ్రీసత్య షిరిడి సాయిబాబా మందిర వార్షికోత్సవం శనివారం జరుగనుంది. ప్రతియేటా ఫిబ్రవరి మూడవ తేదీన మందిర వార్షికోత్సవాన్ని గ్రామంలో భారీ తిరునాళ్లగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. పెదవడ్లపూడి ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచింది. 2006లో అప్పటి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా వున్న పాతూరి నాగభూషణం స్వగ్రామమైన పెదవడ్లపూడిలో షిర్డి సాయిబాబా మందిరాన్ని మంగళగిరి-తెనాలి రోడ్డు వెంబడి నిర్మించారు. మందిరంతోపాటు దానిపక్కనే విష్వేశ్వరస్వామి ఉపాలయాన్ని నిర్మించారు. అప్పటినుంచి బాబావారి ఉత్సవ వేడుకలతోపాటు ప్రతియేటా మందిరాన్ని ఆరంభించిన ఫిబ్రవరి మూడవ తేదీన ఆలయ వార్షికోత్సవం పేరిట గ్రామంలో ఉత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఉత్సవానికి అటు ఆధ్యాత్మికతను, ఇటు సాంస్కృతిక వైభవాన్ని మేళవించి దీనినో భారీ తిరునాళ్ల మాదిరి జరిపిస్తున్నారు. మందిరానికి ఎదురుగా ఓ ప్రత్యేక గోశాలను కూడ ఏర్పాటు చేయించి మందిర విశిష్టతను మరింత ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. భగవాన్ శ్రీసత్య షిరిడి సాయిబాబా మందిర 18వ వార్షికోత్సవానికి అన్నీ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రానికే పూర్తిచేశారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ ఛైర్మన్, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ పాతూరి నాగభూషణం గత రెండు రోజులుగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మందిరానికి ఎదురుగా వున్న ఖాళీస్థలంలో సాంస్కృతిక కళావేదిక ప్రాంగణం, దాని పక్కనే అన్న ప్రసాదశాలను ఏర్పాటు చేయించారు. శనివారం తెల్లవారుజాము అయిదు గంటల నుంచే బాబావారి విగ్రహానికి వివిధ అభిషేకాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. పెద్దఎత్తున అన్నవితరణకు ఏర్పాట్లను చేశారు.



న్యాయవాదుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న కేశినేని చిన్ని, గద్దె అనురాధ

భూ హక్కు చట్టంతో సివిల్ కోర్టులకు కాలం చెల్లు

» రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్

» 44వ రోజున 44మంది మహిళా న్యాయవాదుల దీక్ష

విజయవాడ లీగల్, ఫిబ్రవరి 2 : న్యాయవాదుల నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 44వ రోజుకు చేరగా 44 మంది మహిళా న్యాయవాదులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ, భూ హక్కు చట్టం-2022 అమల్లోకి వస్తే సివిల్ కోర్టులకు కాలం చెల్లినట్టేనన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు జిల్లాస్థాయి కోర్టులో 151, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు 131, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు 271లతో కలిపి రాష్ట్రం మొత్తం మీద 553 సివిల్ కోర్టులు పనిచేస్తున్నాయన్నారు. ఈ చట్టం అమలులోకి వస్తే ఈ కోర్టుల్లో సివిల్ కేసులు దాఖలు చేసేందుకు వీలుండదన్నారు. వీటిస్థానంలో ప్రతి జిల్లా కేంద్రంలో ఒక్కొక్క ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి కేవలం 26 ట్రిబ్యునల్స్‌లో కేసులను త్వరితగతిన పరిష్కారం చేస్తామని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమన్నారు. శుక్రవారం నాటి దీక్షలో సీనియర్ మహిళా న్యాయవాదులు కిలారు సరళా బెనర్జీ, బోసు జయమ్మ, యు.సునీల, పి.జయలక్ష్మి, మొవ్వా చంద్రకుమారి, పద్మజ, అచ్చెమాంబ, కోనేరు జయప్రభ, నిమ్మగడ్డ ఝాన్సీ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే రద్దు చేయిస్తాం : కేశినేని చిన్ని

భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా 44 రోజులుగా న్యాయవాదులు చేస్తున్న నిరసన దీక్షలకు శుక్రవారం టీడీపీ నేతలు కేశినేని శివనాథ్ (చిన్ని), మాజీ జెడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ తమ సంఘీభావాన్ని ప్రకటించారు. సైకో జగన్ ప్రభుత్వానికి పోయేకాలం దగ్గరలోనే ఉందని మండిపడ్డారు. తెలుగుదేశం-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే చట్టాన్ని రద్దు చేయిస్తామని హామీ ఇచ్చారు.

బందరులో నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసన

మచిలీపట్నం టౌన్ : వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టం వల్ల ప్రజలకు హాని చేకూరుతుందంటూ శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు నల్లబెలూన్లు ఎగురవేసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. న్యాయదేవత విగ్రహం ఎదుట నిర్వహించిన ఈ నిరసన ప్రదర్శనలో మచిలీపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తుంగల హరిబాబు మాట్లాడుతూ, మూడు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలంటూ న్యాయవాదులు, న్యాయవాదుల గుమాస్తాలు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడుతూ పోరాటం చేస్తున్నారన్నారు. పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు మద్దతు తెలుపుతున్నాయని, అయితే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదన్నారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి కొట్టె రఘురాం, సర్వా లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

పెడన సర్కిల్ పరిధిలో సీఐ, ఎస్సైల బదిలీ

పెడన : పెడన పోలీసు సర్కిల్ పరిధిలోని ఎస్సైలు అందరినీ బదిలీ చేశారు. పెడన ఎస్సై రవిచంద్రకుమార్‌ను ఉంగుటూరుకు బదిలీ చేసి ఆయన స్థానంలో ఆత్కూరు ఎస్సై పి. సూర్యశ్రీనివాస్‌ను ఇక్కడ నియమించారు. గూడూరు ఎస్సై వి. శేషకుమార్‌ను పెనమలూరుకు బదిలీ చేసి ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. బంటుమిల్లి ఎస్సై ఏ. పైడిబాబును ఆత్కూరుకు బదిలీ చేసి ఆయన స్థానంలో ఉయ్యూరు ఎస్సై జి. వాసును నియమించారు. కృత్తివెన్ను ఎస్సై ఏ. గణేష్‌కుమార్‌ను ఉయ్యూరుకు బదిలీ చేసి ఆయన స్థానంలో గన్నవరం ఎస్సై కె. నాగరాజును నియమించారు. సీఐ హబీబ్ బాషాను కూడా బదిలీ చేశారు. ఆయనను ఉయ్యూరుకు బదిలీ చేసి ఆయన స్థానంలో ఏలూరు రేంజ్ సీఐ కె. నాగేంద్రకుమార్‌ను నియమించారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం తథ్యం



» ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు

గుడివాడ, ఫిబ్రవరి 2 : ప్రణాళికబద్ధంగా చదివితే గ్రూపు-1, 2 ఉద్యోగాలను సాధించవచ్చునని కృష్ణా, ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు అన్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో యూటీఎఫ్ గుడివాడ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గ్రూపు-1, 2 పరీక్షలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు భారత సమాజం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రుల చరిత్ర మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకర్, జిల్లా కార్యదర్శి ఎ.వి.వరలక్ష్మీ, ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



జూదరులతో ఎస్ఐ సందీప్, సిబ్బంది

కోడిపందాల బరులపై దాడులు

» పోలీసుల అదుపులో 15 మంది

» రూ.23 వేలు, ఆరు బైక్‌లు స్వాధీనం

కూచిపూడి, ఫిబ్రవరి 2 : చినముత్తేవి, అయ్యంకి కాలువ గట్టు సమీపంలో వేస్తున్న కోడిపందాల బరులపై కూచిపూడి ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. 15 మందిని అరెస్టు చేసి, రెండు కోడిపుంజులు, ఆరు మోటారు సైకిళ్లు, రూ.23,200 స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై సందీప్ తెలిపారు.



యూనియన్ డైరీ ఆవిష్కరిస్తున్న నేతలు

ఏపీయూడబ్ల్యూజే డైరీ ఆవిష్కరణ

ధర్నాచౌక్, ఫిబ్రవరి 2 : జర్నలిస్టులకు ఉపయోగపడేలా విస్తృత సమాచారంతో 2024 డైరీని రూపొందించినట్టు ఏపీయూడబ్ల్యూజే నేతలు పేర్కొన్నారు. యూనియన్ ముద్రించిన 2024 డైరీని గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించి వారికి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఆయా పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. యూనియన్ విజయవాడ యూనిట్ అధ్యక్షుడు చావా రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సి.చానల్ అధినేత టీవీ.రమేష్‌బాబు, యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్థన్, ఐజేయూ కార్యదర్శి డి.సోమసుందర్, సభ్యుడు ఎస్‌కే.బాబు, సామ్నా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కంచెల జయరాజ్, కౌన్సిల్ సభ్యుడు దారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.28

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 2 : దాతలందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకుని చదువులో ఉన్నతంగా రాణించి ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవాలని ఏపీ సమగ్రశిక్ష అభియాన్ ప్రతినిధి డాక్టర్ పెంచలయ్య విద్యార్థులకు సూచించారు. ఉంగుటూరు జడ్పీహైస్కూల్‌ను శుక్రవారం రాష్ట్ర సమగ్రశిక్షా అభియాన్ ప్రతినిధుల బృందం సందర్శించింది. పాఠశాలలో సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన దాత బొబ్బా వెంకటాద్రిని ఈ సందర్భంగా వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చోరగుడి అనిత, సమగ్రశిక్షా అభియాన్ ప్రతినిధులు నళినీకుమారి, విజయ, శ్రీహరి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆటోనగర్ జెమ్స్ ఆధ్వర్యంలో
5న మెగా వైద్యశిబిరం

ఆటోనగర్(పెనమలూరు), ఫిబ్రవరి 2 : లయన్స్ క్లబ్ ఆటోనగర్ జెమ్స్ ఆధ్వర్యంలో ఈనెల ఐదున మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ మాజీ జడ్‌సీ బెవర నాగేశ్వరరావు, మాజీ ఆర్సీ కాంతారావు తెలిపారు. రామవరప్పాడు బల్లెంవారి వీధి సమీపంలోని ఒక కల్యాణమండపంలో జరిగే ఈ వైద్య శిబిరంలో అమెరికన్ అంకాలజీ ఆసుపత్రి వైద్యులు క్యాన్సర్ స్క్రీనింగ్ గురించిన పరీక్షలు, వాసన్ ఐకేర్ ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు, మోహన్ డయాబెటిక్ ఆసుపత్రి వైద్యులు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తారని తెలిపారు.

నేడు మామిడి రైతులకు అవగాహన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 2 : మామిడిసాగులో తీసుకోవాలిసిన సస్యరక్షణ చర్యలపై ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు అవగాహన సదస్సు శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు మండల ఉద్యానశాఖ అధికారి హరిశ్చంద్ తెలిపారు. మల్లవల్లిలో పెట్రోల్‌బంకు ఎదురుగా గల మామిడితోటలో నిర్వహించే ఈ సదస్సులో జిల్లా అధికారి జ్యోతి, మామిడి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త లక్ష్మి పాల్గొంటారని తెలిపారు.

ఆర్‌ఆర్‌డీఎస్ సేవలకు సహకారం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎన్నారై తుమ్మల రాంబాబు, ఆళ్ల గోపాలకృష్ణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 2 : గ్రామంలోని ప్రజలకు మరింతగా సేవ లందించేలా ఆర్‌ఆర్‌డీఎస్(రంగన్నగూడెం రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ)కి సహకార మందిస్తామని ఎన్నారై తుమ్మల రాంబాబు తెలిపారు. రంగన్నగూడెంలో తమ కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన ఏటీఎం కార్డు సాంకేతికతతో కూడిన మినరల్ వాటర్ ప్లాంట్ పనితీరును నాంది అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్ వెంకట శ్రీనివాస్‌తో కలసి ఆయన శుక్రవారం పరిశీలించారు. తాగునీటి నాణ్యత, సూక్ష్మక్రిములను ఫిల్టర్ చేసే విధానం, కార్డు ద్వారా మినరల్ వాటర్ ఫిల్లింగ్ తదితర విషయాలను పరిశీలించారు. తన స్వగ్రామంలో ఆర్‌ఆర్‌డీఎస్ కార్యదర్శి ఆళ్ల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అవసరమైన వారికి సేవలను మరింత విస్తృతం చేసేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొలుసు బలరాం, కసుకుర్తి అర్జునరావు, వాటర్ ప్లాంట్ సిబ్బంది మొవ్వా రాజన్‌నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆసరాపై అవగాహన

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఆసరా (రుణ మాఫీ) పథకం ద్వారా అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకునేలా గ్రామైఖ్య సంఘాలు అవగాహన పెంచాలని బాపులపాడు మండల వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం ఎస్. భూపతిరావు అన్నారు. మండలంలోని 1780 డ్వాక్రా గ్రూపులకు ఆసరా పథకం కింద రూ.64.23 కోట్లు మంజూరైంది. మూడు విడతలు పంపిణీ చేశారు. నాల్గవ విడతగా రూ.16.65 కోట్లు రిలీజు చేయనున్నారు. ఈ సందర్భంగా వెలుగు కార్యాలయంలో శుక్రవారం నాల్గవ విడత ఆసరాపై బుక్ కీపర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఏపీఎం నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

జగన్‌ను సాగనంపేందుకు సిద్ధం

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, ఫిబ్రవరి 2 : వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ నాయకుల అవినీతి, అక్రమాలు ప్రజలు గ్రహించి రానున్న ఎన్నికల్లో జగన్‌ను సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విమర్శించారు. ఉయ్యూరు 16వ వార్డులో శుక్రవారం పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుని తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెనమలూరులో అప్పుడే ఇసుక అక్రమ దందాకు జోగి రమేశ్ అనుచరులు పూనుకున్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి లోకేశ్‌ను విమర్శించే స్థాయి జోగి రమేశ్‌కు లేదన్నారు. మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, గుర్నాధరావు, పార్టీ నాయకులు చలపాటి శ్రీను, కె వాసు, జంపాన అర్జునరావు, ఈడే అంజిబాబు, రాజులపాటి ఫణికుమార్, జంపన వీరశ్రీనివాస్, అజ్మతుల్లా, జయదేవ్, కౌన్సిలర్లు సుధారాణి, పలియాల శ్రీనివాసరావు, సలోమి సంతోషి, జనసేన నాయకులు కార్తికేయ, చినకోటయ్య, ఆదినారాయణ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు 16వ వార్డులో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సాయిపురంలో..

సాయిపురంలో శుక్రవారం టీడీపీ నాయకులు పర్యటించి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించి తెలుగుదేశం, జనసేన ఆధ్వర్యంలో రానున్న ప్రభుత్వం మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, బోడె వెంకట్రామ్, సాయిపురం సర్పంచ్ బాషా, వెంకటేశ్వరరావు,బాబు, జబర్లపూడి సర్పంచ్ ప్రసాద్, జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒక చాన్స్‌తో రాష్ట్రం అధోగతి

కంకిపాడు : రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తా ఒక చాన్స్ ఇవ్వమేంటే ప్రజలు నమ్మి జగన్‌కు ఒక చాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశాడని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి హేమ అన్నారు. మండలంలోని కోలవెన్నులో శుక్రవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్ర మంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా బోడె హేమ జన్మదిన వేడుకలను తెలుగు దేశం, జనసేన పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం చంద్రబాబు నాయుడు ఆరు గ్యారెంటీలతో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమ వుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తుమ్మల జగదీష్, కళ్యాణి, నరేష్, ఇమ్మానుయేలు, కొండా నాగేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, జగన్, పాలడుగు సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకలు అయ్యప్ప, వెంకట్, అన్నవరపు జాని, జగన్నాధం, రమేష్ పాల్గొన్నారు.



కోలవెన్నులో బోడె హేమ జన్మదిన వేడుకలు

విశాఖ రైల్వే జోన్‌కు స్థలం కేటాయించకపోవడం సిగ్గుచేటు

పెనమలూరు : కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా మొత్తుకుంటున్నా విశాఖ రైల్వే జోన్‌కు స్థలం కేటాయించలేని నువ్వు ఏముఖం పెట్టుకొని రాష్ట్ర ప్రజలను వచ్చే ఎన్నికల్లో ఓట్లడుగుతావని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని టీడీపీ నాయకులు దేవినేని గౌతమ్ స్మిత దంపతులు, టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ కార్యదర్శి మొక్కపాటి శ్రీనివాస్ ప్రశ్నించారు. శుక్రవారం తాడిగడపలోని అంబేడ్కర్ నగర్, యనమలకుదురులలో జరిగిన బాబుష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. రైల్వే జోన్ ఇస్తామని కేంద్రం ప్రతిపాదించినా స్థలం కేటాయించకపోవడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, సాయి, రాజా, ఆజాద్, లోకేష్, బలగం కొండ, సుబ్బు, రాజా తదితరులు పాల్గొన్నారు.



తాడిగడపలో టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న దేవినేని గౌతమ్ దంపతులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సాఫ్ట్‌బాల్‌లో వీఆర్ సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

పెనమలూరు, ఫిబ్రవరి 2 : మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూకే అంతర కళాశాలల సాఫ్ట్‌బాల్ టోర్నమెంటులో వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మూడవ స్థానంలో నిలిచినట్లు కళాశాల పీడీ పోతిన రఘు తెలిపారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, డీన్ పాండురంగారావు అభినందించారు.

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యకు అభినందన



వెంకయ్యనాయుడును అభినందిస్తున్న బీజేపీ నేతలు

పెనమలూరు, ఫిబ్రవరి 2 : మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంయ్యనాయుడును బీజేపీ నేతలు అభినందించారు. ఇటీవల భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ నేతలు హైదరాబాద్‌లో శుక్రవారం ఆయనను నివాసంలో కలిసి అభినందించి, సన్మానించారు. బీజేపీ కృష్ణాజిల్లా మాజీ అధ్యక్షుడు వల్లూరు శ్రీమన్నారాయణ, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, జమ్ముల శ్యాం కిషోర్, కుక్కపల్లి నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

సామాజిక సేవలే మానవత కర్తవ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 2 : సామాజిక సేవలతో పాటు యువతలో సేవాదృక్పథం పెంపొందిస్తూ చైతన్యం తీసుకువచ్చే విధంగా మానవత సేవా సంస్థ పని చేస్తుందని రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. ఉమామహేశ్వరపురానికి చెందిన నల్ల రామకృష్ణకు వైద్యఖర్చుల నిమిత్తం మానవత సేవా సంస్థ ద్వారా ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. మధుమేహం వల్ల రామకృష్ణకు కాలు తొలగించడంతో తమ వంతు సహాయంగా రూ. 8వేలు అందజేసి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కూరెళ్ల సుబాచారి, కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు, చెక్క సుబ్బారావు, వేగిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రంగబాబుపై దాడి ఘటనలో దళితుడి బలి

టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు

గన్నవరం, ఫిబ్రవరి 2 : గన్నవరం పీఏసీఎస్ అధ్యక్షుడు రంగబాబుపై జరిగిన హత్యాయత్నం ఘటనలో ఆత్కూరుకు చెందిన దళితుడు ముగ్గిరాల చిరంజీవిని ఏ1గా చూపటం దారుణమని, పోలీసులు నమోదు చేసిన సెక్షన్‌లు సరైనవి కావని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ, రంగబాబుపై దాడి ఘటనలో అసలైన నిందితులను వదిలేసి దళితులను దోషులుగా నిలబెట్టడం సరికాదని పోలీసులకు సూచించారు. టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావుకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక దళితులను కేసుల్లో ఇరికించటం భావ్యం కాదని, రౌడీలను తీసుకువచ్చి దౌర్జన్యాలు దాడులు చేయిస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదన్నారు. యార్లగడ్డ ఎమ్మెల్యే అయిన తరువాత మీ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలన్నారు. తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమాదేవి మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగ బద్ధమైన పాలన వదిలేసి ప్రజా వ్యతిరేక విధాలను అవలంభిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీ టీడీపీ నాయకులపైనే కేసులు పెట్టడం కార్యాలయంపై దాడి చేయటం, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసులు పెట్టడం, యువగళం పాదయాత్ర సందర్భంలో కూడా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి కవ్వింపు చర్యలకు పాల్పడడం ప్రజాస్వామ్యంలో మంచిది కాదన్నారు. దళితులను పావులను చేసుకుని ఉన్నత వర్గాలపై దాడులు చేయటం ఎమ్మెల్యేకు సరికాదని, దళితులంటే ఎమ్మెల్యే వంశీకి చిన్నచూపు అన్నారు. ఆయన లబ్ధి కోసం దేనికైనా తెగబడతాడని ఈ ఘటనలు రుజువు చేస్తున్నాయన్నారు. ఆధారాలు ఉన్నప్పటికీ పోలీసులు నిందితులను చూపకుండా ఏ1గా ముగ్గిరాల చిరంజీవిని చూపటం దారుణమన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గొడ్డళ్ల చిన రామారావు, కూచిపూడి సుబ్బయ్య, బడుగు ఝాన్సీ, బోడపాటి రవికుమార్, సగరం కిరణ్, గండెపూడి సతీష్, ప్రేమలీల, ప్రభుదాస్, నిమ్మకూరి మధు, సొంగ సంతోష్, బొకినాల తిరుపతరావు పాల్గొన్నారు.

జనసేన గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ఎంపీ బాలశౌరిని సన్మానిస్తున్న పెనమలూరు జనసేన నేతలు

కంకిపాడు, ఫిబ్రవరి 2 : జనసేన గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి సూచించినట్లు జనసేన పెనమలూరు సమన్వయకర్త ముప్పా రాజా తెలిపారు. మచిలీపట్నంలో బాలశౌరిని శుక్రవారం నియోజకవర్గ ముఖ్య నాయకులు కలిశారు. శాలువ కప్పి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఈ నెల 4న జనసేన రాష్ట్ర కార్యాలయంలో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి వైసీపీ నుంచి జనసేనలో చేరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే టీడీపీ లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 2 : టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళ సాధికారత, స్త్రీ సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తుందని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి అన్నారు. ఓగిరాల టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మహిళ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా కొండపావు లూరి కొండమ్మ, కార్యదర్శిగా గండికోట అన్నపూర్ణతో పాటు 12మందితో కూడిన మహిళ కమిటీని ఏర్పాటు చేశారు. టీడీపీ మినీ మ్యానిఫెస్టోలో అధినేత చంద్రబాబునాయుడు మహిళల సంక్షేమం కోసం, భవిష్యత్ అవసరాల కోసం మహాశక్తి పేరుతో ప్రకటించిన పలు సంక్షేమ పథకాల ద్వారా ఆడబడ్డలు అన్నిరంగాల్లో ప్రగతిపథంలో దూసుకుపోతారన్నారు. గతంలో టీడీపీ హయంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, పెళ్లికానుక, బాలికలకు సైకిళ్లు అందజేత లాంటి వినూత్న పథకాలను అమలు చేయడాన్ని గుర్తుచేశారు. రాష్ట్రభవిష్యత్తు కోసం టీడీపీకి మద్దతుగా మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ టీడీపీ విజయానికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలని మహిళా కమిటీకి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళ కమిటీ సభ్యులు కగ్గా సత్యవతి, కొల్లిపర అన్నపూర్ణ, రత్న తదితరులు పాల్గొన్నారు.



ఓగిరాల తెలుగు మహిళా కమిటీ సభ్యులతో సాయికల్యాణి

ఉపాధి హామీ పనులపై 7న ప్రజావేదిక

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 2 : మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులు సామాజిక తనిఖీలపై ఈ నెల 7న మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు బాపులపాడు మండల ఉపాధి హామి పథకం ఏపీవో అశోక్‌కుమార్ తెలిపారు. గత నెల 25 నుంచి మండలంలోని 27గ్రామాల్లో రూ.8కోట్లు విలువతో నిర్వహించిన 900 పనులపై సామాజిక తనిఖీలు జరుగుతున్నట్లు తెలిపారు.

ప్రసాదంపాడులో పీఎన్‌బీ బ్రాంచ్ ప్రారంభం



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న దీపక్‌కుమార్ శ్రీవాత్సవ

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 2 : దేశంలోనే రెండవ అతిపెద్ద జాతీయ బ్యాంక్ పంజాబ్ నేషనల్ బ్యాంకు అని జోనల్ మేనేజర్ దీపక్‌కుమార్ శ్రీవాత్సవ అన్నారు. నగరంలోని ప్రసాదంపాడులో పంజాబ్ నేషనల్ బ్యాంకు 71వ బ్రాంచ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రిబ్బన్ కట్ చేసి నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా దీపక్ కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ, తమ బ్యాంకులో అన్ని రకాల రుణాలు, డిపాజిట్లు, ఇతర బ్యాంకింగ్ సదుపాయాలు కలవని వివరించారు. అనంతరం బ్యాంకు సర్కిల్ హెడ్ అబిజిత్ సిన్హా మాట్లాడుతూ, తమ బ్యాంకులో గృహ, వాహన, బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సుమన్‌బాబు, బ్యాంకు సిబ్బంది, రిటైర్డ్ పీఎన్‌బి ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సమాజ సేవలో బ్యాంక్ ఆఫ్ బరోడా

గన్నవరం, ఫిబ్రవరి 2: సమాజ సేవలో బ్యాంక్ ఆఫ్ బరోడా తనవంతు పాత్ర పోషిస్తుందని మేనేజర్ జె.దినేష్ అన్నారు. మండలంలోని దావాజీగూడెం స్పందన మానసిక వికాస కేంద్రానికి బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యాన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ దినేష్ మాట్లాడుతూ, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సేవా కార్యక్రమాలు బ్యాంక్ ద్వారా చేస్తున్నామన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఛైర్మన్ వెంకట్ కార్యదర్శి రజిత బ్యాంక్ సిబ్బంది జీవి శ్రీనివాసరావు, మధు ప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలి

గుణదల, ఫిబ్రవరి 2 : గన్నవరం నియోజకవర్గంలో విజయవాడ రూరల్ మండలంను నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. విజయవాడ రూరల్ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల కార్యాలయంలో పనిచేస్తున్న ఇరువురిని జిల్లా కలెక్టర్ డిల్లీరావ్ ఉత్తమ అధికారులుగా గుర్తించి ప్రశంసాపత్రాలు అందజేయడం గర్వించదగిన విషయం అన్నారు. ఆధునిక పద్ధతిలో రూపుదిద్దుకున్న మండల కార్యాలయ భవనాన్ని గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ కొమ్మా కోట్లు, జడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, ఎంపీపీ ప్రసన్నకుమారిలు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వేమూరి సురేష్, కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అల్తాఫ్ పాల్గొన్నారు.

కృష్ణా

• మచిలీపట్నం • పెడన • గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.28

రెండు ఆటోలు ఢీకొని ఏడుగురికి గాయాలు



బాధితులను ఆసుపత్రికి పంపుతున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

పామర్రు : పామర్రు - గుడివాడ ప్రధాన జాతీయ రహదారిపై కొత్త పెద మద్దాలి ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు వ్యక్తులు గాయపడ్డారు. పామర్రు నుంచి గుడివాడ వైపు వెళ్తున్న ట్రక్కు ఆటో ఎదురుగా వస్తున్న ప్రయాణికుల ఆటో పరస్పరం ఢీకొన్నాయి. దాంతో ఆటోలో ప్రయాణిస్తున్న కొమరవోలుకు చెందిన ఏడుగురు వ్యక్తులు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్సై ప్రవీణ్ కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను 108లో గుడివాడ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దళితవాడలో కలుషిత నీటి సరఫరా!



తోట్లవల్లూరు : తోట్లవల్లూరు దళితవాడలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కుళాయి నుంచి కలుషిత నీరు సరఫరా అయ్యింది. మొదటి రెండు బక్కెట్లు నల్లగా రావటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. రెండు బక్కెట్ల నీరు పట్టిన తరువాత మంచినీరు వచ్చింది. పైపులైన్ లీకేజీ అవుతుండటం వల్లే ఇలా కలుషిత నీరు వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఖో-ఖో విజేత గుడివాడ



గుడివాడ : ఎస్‌పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పురుషుల ఖో-ఖో పోటల్లో గుడివాడ నియోజకవర్గ జట్టు ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఫైనల్ పోటీల్లో అవనిగడ్డ జట్టుపై గుడివాడ జట్టు విజయం సాధించింది, ద్వితీయ స్థానంలో అవనిగడ్డ, తృతీయ స్థానంలో గన్నవరం జట్లు నిలిచాయి. గుడివాడ డీవైఇవో పద్మారాణి, జిల్లా కామన్ బోర్డు కార్యదర్శి షేక్ జానీ సాహెబ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దాసరి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి, విద్యా కమిటీ ఛైర్మన్ గుడివాడ సుమిత్రకుమార్, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు. గుడివాడ జట్టు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందని ఖో-ఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మడకా ప్రసాద్ తెలిపారు.

వీకేఆర్ వీఎన్‌బీలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్

గుడివాడ : వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం చెన్నైకి చెందిన ఆల్ సెక్ టెక్నాలజీ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 12 మంది విద్యార్థులు నియామకపత్రాలను అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి ప్రసాదరావు తెలిపారు. బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులు 120 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్లేస్మెంట్ అధికారి నవీన్, ట్రైనింగ్ అధికారి ఎస్.ధనుంజయరావు అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన కళాశాల విద్యార్థులు

అవిరిపూడిలో సచివాలయ భవన ప్రారంభం



కూచిపూడి : అవిరిపూడిలో సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. అంతకుముందుగా పాలంకిపాడులో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు. సర్పంచ్‌లు ఏనుగ ఝాన్సీలక్ష్మీ, ఈడే వెంకట నాగలక్ష్మి, ఏనుగ శ్రీనివాసరావు, ఈడే రామకృష్ణ, మరీదు నాగేశ్వరరావు, యార్లగడ్డ సునీత, ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పీటీసీ రాజులపాటి పార్వతీ, ఏనుగ మోహనరావు, రాజులపాటి రాఘవరావు, అమర బాలేశ్వరరావు, కందుల కోటేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన



మోపిదేవి : కె.కొత్తపాలెంలో కృష్ణానది కరకట్ట వెంబడి ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మాణానికి ఎంపీపీ రావి దుర్గావాణి, సర్పంచ్ కొకికలిగడ్డ మాధవీ శుక్రవారం భూమిపూజ చేశారు. రాజ్యసభ్యులు కనకమేడల రవీంద్ర రూ.5 లక్షలు మంజూరు చేయగా, బస్‌షెల్టర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, టీడీపీ నాయకులు రావి నాగేశ్వరరావు, మత్తి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

పెడన : రైలు కింద పడి ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో జరిగింది. రెండో వార్డుకు చెందిన తాపీ కార్మికుడు ఉమ్మిటి శ్యామసుందరరావు (24) శుక్రవారం తెల్లవారుజామున పైడమ్మ లే అవుట్ సమీపంలో మచిలీపట్నం నుంచి గుడివాడ వైపు వెళుతున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్యామసుందరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





46వ డివిజన్‌లో అన్నదానం చేస్తున్న కొల్లు నీలిమ

దళిత నేతలతో వర్ల కుమార్ రాజా

అన్న క్యాంటీన్లు రద్దు చేసిన దుర్మార్గుడు జగన్

● ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం ● రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 2 : పేదలకు, కార్మికులకు పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్‌లను రద్దు చేసిన సీఎం జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధిచెబుతారని మాజీ మంత్రి రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ అన్నారు.

కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 46వ డివిజన్ జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న రామాలయం వద్ద పేదలకు భోజనం వడ్డించారు. నీలిమ మాట్లాడుతూ, మూడేళ్లుగా కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేస్తున్నామన్నారు. కరోనా సమయంలో రోగులకు ఫౌండేషన్ ద్వారా సేవలందించామన్నారు. మహిళలను చైతన్య పరిచే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. టీడీపీ నగర కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, 46వ డివిజన్ ఇన్‌చార్జి గండికోట అంజిబాబు,పి.వి.ఫణికుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చిన్నం సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వస్తేనే దళితులకు రక్షణ

● టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా

పామర్రు : దళితుల సమగ్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా అన్నారు. దళిత నేతలతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. దళితుల సంక్షేమం కోసం టీడీసీ హయాంలో ప్రవేశ పెట్టిన పథకాలను సీఎం జగన్ రద్దుచేసి దళితుల ఉసురు పోసుకున్నాడన్నారు. జగన్ దౌర్జన్యకాండ నుంచి బయటపడేందుకు టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసే బాధ్యత అందరిపైన ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను గద్దె దింపేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. చింతపల్లి వెంకటేశ్వరరావు, మంతెన రామాంజనేయులు, జమ్మిబాబు, బాబ్జి రవి తదితరులు పాల్గొన్నారు.

జనసేన - టీడీపీ ఉమ్మడి అభ్యర్థి విజయం ఖాయం

● జనసేన మండల అధ్యక్షుడు గుడివాడ శేషుబాబు



అవనిగడ్డ : రానున్న ఎన్నికల్లో ప్రత్యర్థి ఎవరైనా అవనిగడ్డ నియోజకవర్గం నుంచి జనసేన - టీడీపీ అభ్యర్థి విజయం సాధించి తీరుతారని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గుడివాడ శేషుబాబు అన్నారు. అవనిగడ్డలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆసరా పంపిణీలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రతిపక్ష పార్టీలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. వైసీపీ అభ్యర్థి దొరకక పోవటంతో పోటీ చేయటం ఇష్టం లేదని చెబుతున్నా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావు పేరును ప్రకటించిందన్నారు. అభ్యర్థి ఎవరైనా విజయం మాత్రం జనసేన - టీడీపీ ఉమ్మడి అభ్యర్థిదేనన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచామని, కళాశాల ఫీజు మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని ఎమ్మెల్యే అబద్ధాలు ప్రచారం చేసుకోవటం సిగ్గుచేటన్నారు. వైసీపీ పాలనలో ఎరువులు అందక, సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను, జనసేన నేతలు రేపల్లె అవినాష్, తుంగల రమేష్, పప్పుశెట్టి శ్రీను, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 2 : విద్యుత్‌లైన్ల మరమ్మతులు దృష్ట్యా శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు రెండు గంటల పాడు నారాయణపురం, పంబల గూడెం, టెంపుల్ కాలనీ, కేంద్రీయ విద్యాలయం ప్రాంతం, మేదర కాలనీ, పాత హౌసింగ్ బోర్డు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ మచిలీపట్నం అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP No : 44/22 in O.S. No. 164/18

Between :
M. Mohan Kota Nagendra Rao ...DHR
And
Rebba Koteswaramma & 3 Others ...JDR's

ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని యీ నెంబరు డిక్రీ బాకి క్రింద పై కోర్టు వారి యెదుట ది. 23-02-2024వ తేదీ ఉదయం గం. 10-30 ని.ల నుండి వేలం వేయబడును. కావున పాడుకొనదలచిన వారు వేలం పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు : కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా మచిలీపట్నం గ్రామంలో యీ నెంబరు దావాలో JDR అయిన Rebba Koteswaramma వారల సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో వున్నటువంటి యీ నెంబరు దావా బాకి కింద జప్తుకాబడిన వేలం కావలసిన స్థిరాస్తి వివరములు : Old / D/No : 3/105, New D/No. 3/104/1, Extent : 61 Sq. Yards, Having follwing boundaries : East : Site Belongs to Kumbam Gantalamma, South : House & House Site Belongs to Rebba Satyanarayana, West : Compund Wall Belongs to Vajji Dharmarajulu, North : Municipal Lane.

DHR : 8,00,000/-
Ameena Value : 7,32,000/-
Market Value : 10,57,000/-

Note : 1, EC దాఖలా అన్యాక్రాంతములు ఏమియు లేవు.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా : 23-02-2024
V.J.M. లోహియా (జితేంద్ర) న్యాయవాది,
సెల్ : 89191 30246, మచిలీపట్నం.





పెడనలో ముస్లిం జోడో యాత్ర

గుడివాడలో సీఐ ఇంద్ర శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న మత పెద్దలు

ముస్లింలు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి

పెడన : ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో పెడనలో శుక్రవారం ముస్లిం జోడో యాత్ర నిర్వహించారు. పెద్ద మసీదు నుంచి ప్రారంభమైన యాత్ర బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగింది. బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ, ముస్లింలు విద్య, వైద్య, ఉపాధి, రాజకీయ రంగాలలో బాగా వెనుకబడిపోయారన్నారు. ఐకమత్యంతో ముస్లింలు తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అబ్దుల్ ఖదీర్, అయూబ్‌ఖాన్, హనీఫ్‌ఖాన్, హమీదుల్లా, ఖలీల్ సయ్యద్, అబ్దుల్ కలాం, అబ్దుల్ అజీజ్ తదితర ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు గుడివాడలో జోడో యాత్ర

గుడివాడ : ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ముస్లిం జోడో బస్సు యాత్ర ఈనెల 3వ తేదీ శనివారం గుడివాడ రానున్నట్లు ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు సయ్యద్ మహబూబ్ అలీ శుక్రవారం తెలిపారు. ముబారక్ సెంటర్‌లో ఈ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జోడోయాత్ర అనుమతి నిమిత్తం వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశామన్నారు. జోడోయాత్ర సభలో ప్రతి ముస్లిం పాల్గొని సభను విజయవంతం చేయాలని అలీ పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన



పెదపారుపూడి : వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాలపాటి అనూష మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో మధ్యాహ్న భోజన వర్కర్లకు జీతం పెంచుతానని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో శ్రీనివాసరావుకు అందజేశారు. నందు, బి.రమణమ్మ (అధ్యక్షురాలు), జె.విజయ (కార్యదర్శి), సమాధానం, మమత, ధనలక్ష్మి, రిషిత, జయమ్మ, లత, చంటి తదితరులు పాల్గొన్నారు.

దయాకుంభ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



మచిలీపట్నం టౌన్ : బలరామునిపేటలోని జగద్గురు రామానుజ సంస్థాన్‌లో మార్చి 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న దయాకుంభ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సంస్థాన్ స్థానాచార్యులు శ్రీకర రామానుజ కోరారు. దయాకుంభ్ ఉత్సవాల కరపత్రాలను శ్రీకర రామానుజ శుక్రవారం ఆవిష్కరించారు. 25న లక్ష్మీజయంతి, 26న శ్రీమన్నారాయణుని అవతారోత్సవం, 27న జగద్గురు రామానుజాచార్యుల వారి విగ్రహ ప్రతిష్ఠా దినోత్సవం నిర్వహిస్తామన్నారు. లక్ష్మీసహస్ర నామ పారాయణలు, భూ వరాహ యజ్ఞాలు జరుపుతామన్నారు.

రైస్‌మిల్లు కాలుష్యంపై విచారణ

మోపిదేవి : మోపిదేవి వార్పు వద్ద ఉన్న రైసు మిల్లు నుంచి దుమ్ము..ధూళి వచ్చి ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయని స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాలుష్య నివారణ బోర్డు అధికారి జ్యోత్స్నశ్రీ శుక్రవారం విచారణ నిర్వహించారు. రైసుమిల్లు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రైసుమిల్లు చెంతనే ఉన్న గృహాలు, పంటలపై దుమ్ము, ధూళి, ఊక వచ్చి అనారోగ్యం కలిగిస్తున్నాయంటూ సిహెచ్.ధనలక్ష్మి ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు బొందలపాటి వెంకటేశ్వర ప్రసాద్, నూతక్కి శివబాబు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పామర్రు : ఆటో డ్రైవర్లుతోపాటు ఇతర వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ సూచించారు. గుడివాడ రోడ్డులోని శ్రీనివాస రెసిడెన్సీ హాల్‌లో శుక్రవారం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. ఇన్సూరెన్స్ కల్గిన వాహనాలనే నడపాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని హెచ్చరించారు. మహిళ ప్రయాణికులు ఇబ్బందులకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. సీఐ శుభాకర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏఎస్సైలు వెంకటేశ్వరరావు, రాజ్‌కుమార్, సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

చల్లపల్లిలో ఆసరా సభ

చల్లపల్లి : మండలంలో 9,0 77 మంది డ్వాక్రా మహిళలు రూ.8.71 కోట్ల మేర లబ్ధిపొందగా ఆసరా చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆవిష్కరించారు. చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో నాలుగో విడత ఆసరా సభ జరిగింది. సింహాద్రి వికాస్, రైతు విభాగం జోనల్ ఇన్‌ఛార్జి కడవకొల్లు నరసింహారావు, అధికారులు పాల్గొన్నారు.



బంటుమిల్లి తహసీల్దార్‌కు వీడ్కోలు

బంటుమిల్లి : ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలువురు అధికారులు బదిలీ అయ్యారు. తహసీల్దార్ సత్యనారాయణ పదోన్నతిపై సివిల్ సప్లై డీఎంగా ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు దుశ్శాలువా, పూలమాలలతో ఆయనను సత్కరించారు. బంటుమిల్లి ఎంపీడీవోగా రామకృష్ణ బాధ్యతలు చెప్పారు.

లెక్కల ఉపాధ్యాయులకు శిక్షణ

గుడివాడ రూరల్ : ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు ఉపయోగపడే విధంగా బోధించాలని ఎంఈవో బాలాజీ అన్నారు. బేతవోలు ఉన్నత పాఠశాలలో డివిజనల్ స్థాయి గణిత ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు జరిగాయి. మూడు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుడివాడ డివిజన్‌లోని ఉపాధ్యాయులు, ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు టేబుల్ వితరణ

పెడన : ఆర్యవైశ్య సంఘం పెడన పోలీసు స్టేషన్‌కు రూ. 40 వేల విలువ టేబుల్‌ను వితరణ చేసింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా టేబుల్‌ను శుక్రవారం ఎస్సై రవిచంద్రకుమార్‌కు అందజేశారు. కె.టి. మురళీకృష్ణ, ఆత్మకూరి సురేష్‌కుమార్, కొల్లూరి రాధాకృష్ణ, చిలకల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థకు రూ.20 వేల విరాళం

గుడివాడ : మానవతా స్వచ్ఛంద సంస్థకు శ్రీ సాయి సత్సంగం శాంతినగర్ సభ్యులు రూ .20 వేలు విరాళంగా అందజేశారు. మానవత జిల్లా అధ్యక్షుడు పొట్లూరి వీరశేషగిరావు, సభ్యులు పాల్గొన్నారు.



విశ్వాసులకు దుప్పట్ల పంపిణీ

ఘంటసాల : ఘంటసాలలోని పెంతెకోస్తు చర్చిలో 50 మంది విశ్వాసులకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. బిషప్ షడ్రక్ మాట్లాడుతూ శ్యామ్ కిషోర్ నాయుడు గత మూడు దశాబ్దాలకు పైగా దివిసీమలో పలు చర్చిల్లో పాస్టర్లు, విశ్వాసులకు, పేదలకు సహాయం చేస్తున్నారన్నారు. శ్యామ్ కృష్ణ పాస్టర్లు ప్రేమ్ చంద్, కె.ఎస్.పాల్, సిహెచ్.దానియేలు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల ఎస్సైగా ప్రతాప్ రెడ్డి

ఘంటసాల : ఘంటసాల ఎస్సైగా కె.ప్రతాప్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సై ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా అధికార, ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకారం అందించాలని కోరారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి

మచిలీపట్నం టౌన్ : పెన్షనర్లకు బకాయిలను చెల్లించాలని రిటైర్డు ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు రామస్వామి డిమాండ్ చేశారు. ఏపీ ఎన్జీవో కార్యాలయంలో రామస్వామితో పాటు సంఘ కార్యదర్శి వరప్రసాద్ తదితరులు మాట్లాడారు. దివంగత నేత పిళ్లారిశెట్టి రాంబాబు చిత్రపటానికి నివాళులర్పించారు.

చలో అసెంబ్లీకి తరలిరండి

నాగాయలంక : సర్పంచ్‌ల సమస్యలపై ఈనెల 6న జరిగే చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి మండలి ఉదయభాస్కర్ పిలుపునిచ్చారు.